

పల్లెల్లో బెట్టింగుల జోరు
క్రికెట్ బెట్టింగులు పట్టణాల నుంచి పల్లెలకు పాకాయి. సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో ఈ ఊబిలో పడుతున్నారు. - 8లో



గజరాజుల ఆగ్రహం
ఏనుగుల గుంపు యాదమరి మండలంలో పంట పొలాలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సా)	సహార్ శుక్రవారం (ఉ)
చిత్తూరు	6-29	4-52
పుంగనూరు	6-31	4-56

న్యూస్‌రీల్

వెబ్‌సైట్‌లో టీచర్ల సీనియారిటీ జాబితా

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ టీచర్ల జనరల్ సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందు పరిచినట్లు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్లు డీఈఓ వెబ్‌సైట్ లో పొందుపరిచిన జనరల్ సీనియారిటీ జాబితాను సరిచూసుకోవాలన్నారు. ప్రస్తుతం పొందు పరిచిన జనరల్ సీనియారిటీ జాబితాను మార్చి 4వ తేదీ టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆధారంగా రూపొందించినట్లు చెప్పారు. సంబంధిత జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లైతే డీడీవోతో ధ్రువీకరించుకుని ఈనెల 29 లోపు చిత్తూరు డీఈఓ కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

ఫిజిక్స్ పరీక్షకు 248 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన పదో తరగతి ఫిజిక్స్ పరీక్షకు 248 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. జిల్లాలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 21,143 మంది విద్యార్థులకు గాను 20,895 మంది హాజరవ్వగా 248 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అబ్జర్వర్ 4, డీఆర్‌వో మోహన్ కుమార్ 1, డీఈవో 3, ఫ్లెయింగ్ స్క్వాడ్ 15 మంది 19 కేంద్రాలను పరిశీలించారన్నారు. సిట్టింగ్ స్క్వాడ్ 65 మంది పరీక్ష కేంద్రాల్లో విధులు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

యోగా అవార్డుల ప్రమోషన్‌కు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో యోగా అవార్డుల ప్రమోషన్‌కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ అవార్డులు వ్యక్తిగతంగా, నిష్కళమైన ట్రాక్ రికార్డ్ ఉద్యోగోన్నతులు, పోకడలపై నిష్ణాతులైన వ్యక్తులకు అందిస్తారన్నారు. అర్హులైన వారు www.innovateindia. mygov.in/pm&yoga&awards వెబ్‌సైట్‌లో ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ అభ్యర్థుల జాబితా

చిత్తూరు కలెక్టరేట్ : ఫేస్-2లో డీఎస్సీ ఉచిత శిక్షణకు అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను జ్ఞాన భూమి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలతో డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నారని చెప్పారు. చిత్తూరు జిల్లా కేంద్రంలోని మిట్టూరులో కుట్టి కోచింగ్ సెంటర్ ను డీఎస్సీ శిక్షణకు ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఫేస్-1లో వెబ్ ఆప్షన్ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రస్తుతం ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదన్నారు. ఫేస్-2లో ఉచిత డీఎస్సీ శిక్షణకు షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థుల వివరాలు www.mdfc.apcfss.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

మరోసారి.. బరి తెగింపు



మాకు సభ్యుల బలం లేకున్నా.. అధికార బలం..బలగం ఉంది. అడ్డదారా?..దొడ్డిదారా? ఏదైతేనేం.. స్థానిక సంస్థల పదవులన్నీ మా వశం కావాలి.. అందుకు దేనికైనా బరితెగిద్దాం.. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సర్పంచ్ స్థానాలన్నీ కైవసం చేసుకుందాం.. అన్న రీతిలో కూటమి నేతలు మరోసారి బెదిరింపులు, దౌర్జన్యాలు..దాష్టీకాలు చేయాలని కుట్రలు పన్నుతున్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులను తమవైపు తిప్పుకోవడానికి కేసులు పెట్టించి, కుయుక్తులు చేస్తున్నారు.

- నేడు మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్ష, సర్పంచ్ ఉపఎన్నికలు
- బలం లేకున్నా పదవుల కైవసం కోసం..
- రామకుప్పంలో బరితెగింపు
- ముగ్గురు వైఎస్సార్‌సీపీ నేతలను మాయం చేసిన పోలీసులు
- రక్షణ కల్పించమని పోలీసులకిచ్చిన వినతి పత్రం లాగి పడేసిన టీడీపీ నేతలు
- తిరుపతి రూరల్ ఎంపీపీ ఉపఎన్నికపై న్యాయస్థానం మూడో కన్ను
- తవణంపల్లిలో గూడుపుఠాణి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి డిప్యూటీ మేయర్ ఉపఎన్నిక తరహాలో మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్ష, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకునేందుకు కూటమి నేతలు బరితెగించాలని కుట్రలకు పదును పెడుతున్నారు. ఈ ఉపఎన్నికల్లో కూడా కిడ్నాప్, దౌర్జన్యం, దాడులు చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో నాలుగు ఎంపీపీలు, రెండు ఉపాధ్యక్ష, రెండు కో-ఆప్షన్, నాలుగు సర్పంచ్ స్థానాలకు నేడు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు.

పూతలపట్టులో కుట్రలు

పూతలపట్టు నియోజక వర్గం తవణంపల్లి ఎంపీపీ స్థానాన్ని సైతం దౌర్జన్యంగా కైవసం చేసుకునేందుకు టీడీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారు. ఇక్కడ కూడా టీడీపీకి బలం లేకపోయినా దౌర్జన్యంగా అయినా పీఠాన్ని దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

రామకుప్పంలో ముగ్గురిని మాయం చేసిన పోలీసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం పరిధిలోని రామకుప్పం ఎంపీపీ పదవి కోసం అధికార కూటమి నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారు. బుధవారం ముగ్గురు వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసుల ద్వారా గుర్తు తెలియని ప్రాంతానికి తరలించారు. రామకుప్పం ఎంపీపీగా ఉన్న మనీంద్రం శాంతకుమారి మృతితో ఎంపీపీ ఎన్నిక అనివార్యం అయ్యింది. మండలంలోని మొత్తం 16 ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచారు. గత ఏడు నెలలో వారిలో ఏడుగురిని టీడీపీ తమ వైపునకు తిప్పుకుంది. ఎంపీటీసీ సభ్యుడు మంజునాథ్‌పై పోక్సో కేసు పెట్టడంతో పరారీలో ఉన్నాడు. తనను అరెస్టు చేయకుండా చూస్తే టీడీపీకి మద్దతు ఇస్తానని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. ఎలాగైనా ఎంపీపీ పీఠం దక్కించుకోవాలని కూటమి నేతలు ప్రలోభాలు, బెదిరింపు దిగారు. అయినా మెజారిటీ ఎంపీటీసీ సభ్యుల మద్దతు సంపాదించలేకపోయారు. దిగజారుడు రాజకీయాలకు తెరతీశారు. గురువారం జరగనున్న ఎన్నికకు సంబంధించి వైఎస్సార్‌సీపీ తరఫున బీఫాం, విప్ జారీ పత్రాలు అందజేసేందుకు ఎమ్మెల్సీ భరత్ పీఏ మురుగేష్, రామకుప్పం మండలానికి చెందిన సర్పంచులు భాస్కర్‌నాయక్, మోహన్‌నాయక్ బుధవారం రామకుప్పం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లారు. ఆ ముగ్గురిని పోలీసులు అక్కడి నుంచి తమ వాహనంలో తీసుకుపోయారు. ఎందుకు అదుపులోకి తీసుకున్నారో ఎవరికీ సమాచారం ఇవ్వలేదు. ఎక్కడికి తీసుకెళ్లారో కూడా తెలియదు. ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లిన తమ వారు ఎంతకూ తిరిగిరాకపోవడంతో వెతుకుతూ వెళ్లిన మురుగేష్ బంధువు రాము పైనా కూటమి నేతలు దాడికి తెగబడ్డారు. కాగా తన భర్త ప్రాణాలకు పోలీసుల నుంచి ముప్పు పొంచి ఉందని మురుగేష్ భార్య, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షురాలు లలిత ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం, వారిని ఎక్కడ ఉంచారనే సమాచారం కూడా ఇవ్వకపోవడంపై గురువారం హైకోర్టును ఆశ్రయిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ భరత్ చెప్పారు.

వినతి పత్రం లాక్కున్న టీడీపీ నేతలు

వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులకు రక్షణ కావాలని ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త భరత్ పీఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ ఫిర్యాదు కాపీని టీడీపీ నేతలు పోలీసుల నుంచి లాక్కొని పడేశారు. వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు స్వీకరించడానికి వీల్లేదని పోలీసులకు టీడీపీ నేతలు హుకుం జారీ చేసినట్లు సమాచారం. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎవరూ రామకుప్పం మండల పరిషత్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో కనిపించడానికి వీల్లేదని తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు.

సదుంపై సందిగ్ధం

పుంగనూరు నియోజక వర్గం సదుం మండల పరిషత్ అధ్యక్షుడు ఎల్లప్ప మరణంతో ఎంపీపీ ఉపఎన్నిక అనివార్యమైంది. ఇక్కడ మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలుంటే అన్నింటా వైఎస్సార్‌సీపీ శ్రేణులే ఉన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎంపీటీసీ సభ్యులను రకరకాలుగా ఇబ్బందులకు గురిచేసినా, భయపెట్టి టీడీపీ వైపు వెళ్లలేదు. ఇప్పటివరకు టీడీపీ వైపు నుంచి ఎవరూ పోటీ చేసే అవకాశం కనిపించలేదు. ఇకపోతే మండల పరిషత్ ఉపాధ్యక్షుల ఉపఎన్నికలో రామకుప్పం మినహా, విజయపురం ఉపాధ్యక్ష పదవికి టీడీపీకి బలం లేదు. ఇప్పటివరకు టీడీపీ వైపు నుంచి ఎవరూ పోటీలో లేరు. చేసే అవకాశం కూడా కనిపించలేదు.

తిరుపతి రూరల్ ఎంపీపీ ఉప ఎన్నికపై హైకోర్టు ఫోకస్

తిరుపతి రూరల్ ఎంపీపీ పదవికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రాజీనామా చేయడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. మొత్తం 40 ఎంపీటీసీ స్థానాల్లో 38 వైఎస్సార్‌సీపీ శ్రేణులే గెలుపొందారు. ఒక్కటే ఒక్కటి టీడీపీ దక్కించుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఐదుగురు ఎంపీటీసీ సభ్యులను భయపెట్టి టీడీపీ వైపు తిప్పుకున్నారు. 32 మంది ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారు. తిరుపతి డిప్యూటీ మేయర్ ఉపఎన్నిక సందర్భంగా కూటమి నేతలు చేసిన అరాచకాలను దృష్టిలో ఉంచుకుని, తిరుపతి రూరల్ ఎంపీపీ ఎన్నికను సజావుగా నిర్వహించేందుకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎంపీటీసీ సభ్యులను సురక్షితంగా మండల పరిషత్ కార్యాలయం వరకు తీసుకొచ్చి తీసుకెళ్లేంత వరకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని న్యాయస్థానం ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. మండల పరిషత్ కార్యాలయంలో, కార్యాలయానికి కిలోమీటరు దూరం వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఎంపీపీ ఎన్నిక పోలీసుల భద్రత మధ్య నిర్వహించాలి, ఈ ఎన్నిక నిర్వహణ మొత్తం సీసీ కెమెరాలో రికార్డు కావాలి. ఆ రికార్డులను న్యాయస్థానానికి సమర్పించాలని ఆదేశించింది. న్యాయస్థానం ఆదేశాలతో కూటమి నేతలు షాక్‌కు గురయ్యారు.

నేటి ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. గురువారం రామకుప్పం, తవణంపల్లె, సదుం, తిరుపతి గ్రామీణ మండల పరిషత్ అధ్యక్ష స్థానాలు, రామకుప్పం, విజయపురం వైస్ ఎంపీపీ స్థానాలకు, పెనుమూరు, పీలేరు మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ స్థానాలకు జరిగే ఎన్నికల్లో ఎంపీటీసీ సభ్యులు పాల్గొని ప్రత్యక్షంగా చేతులు ఎత్తి ఎన్నుకుంటారన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో పలు నియామకాలు చేపట్టారు. ఈ మేరకు వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటించింది. కుప్పం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన జే.ఎం.కృష్ణమూర్తిని జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అలాగే పలమనేరు, పూతలపట్టు నియోజకవర్గంలోని మండలాలకు పార్టీ మండల అధ్యక్షులను ప్రకటించారు. పలమనేరు మున్సిపాలిటీకి పి.హేమంత్‌కుమార్, పలమనేరుకు బాలాజీనాయుడు, బైరెడ్డిపల్లెకు కేశవులు, వి.కోటకు కే.యువరాజు, పెద్దపంజాణికు బాగారెడ్డి, గంగవరంకు భాస్కర్ రెడ్డి, పూతలపట్టుకు పి.శ్రీకాంత్‌రెడ్డి, ఐరాలకు పి.చంద్రశేఖర్‌రెడ్డి, తవణంపల్లెకు సి.పి.హరిరెడ్డి, బంగారుపాళ్యంకు పి.రామచంద్రారెడ్డి, యాదమరికి బి.ధనంజయరెడ్డిని నియమించారు.

బాలల న్యాయ మండలిలో సభ్యుల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : ఐసీడీఎస్ శాఖ పరిధిలోని బాలల న్యాయ మండలిలో సభ్యుల నియామకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రొబేషన్ అధికారి లక్ష్మీపతి తెలిపారు. బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సభ్యుల నియామకం చేయనున్నట్లు వెల్లడించారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు గల నిబంధనలను www.wdew.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచారన్నారు. సంబంధిత దరఖాస్తుల ను ఏప్రిల్ 9వ తేదీలోగా పంపించాలని వెల్లడించారు. ఇతర వివరాలకు 97013 86650 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

117 మంది హోంగార్డుల బదిలీ

- ఇందులోనూ అధికారుల చేతివాటం?
- పోలీస్ కార్యాలయంలోనే

చిత్తూరు అర్బన్ : చిత్తూరు జిల్లా నుంచి 117 మంది హోంగార్డులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. చిత్తూరు, తిరుపతి పోలీసు జిల్లాల విభజన అనంతరం సిబ్బంది పంపకాలు పూర్తయ్యింది. 2022లో ఏర్పాటైన కమిటీ చిత్తూరు జిల్లాలో ఉన్న 117 మంది హోంగార్డులను తిరుపతికి బదిలీ చేయాలని నిర్ణయించింది. అప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బదిలీ వాయిదా పడింది. గతేడాది 61 మంది హోంగార్డులు తిరుపతి జిల్లాలో రిపోర్టు చేసుకున్నారు. తాజాగా 56 మంది హోంగార్డులు తిరుపతిలో జాయినింగ్ రిపోర్టు ఇవ్వాలని అక్కడి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, చిత్తూరు ఎస్పీకి లేఖ రాశారు. కాగా 2022లో హోంగార్డుల బదిలీపై కమిటీ ఇచ్చిన నివేదికలో ఇద్దరు హోంగార్డుల పేర్లు లేవు. తిరుపతికి వెళ్లాల్సిన ఇద్దరు హోంగార్డుల జాబితాలో ఇద్దరి పేర్లను తొలగించిన పోలీసు శాఖలోని ఓ సిబ్బంది, వారి స్థానంలో బదిలీకానటువంటి ఇద్దరిని తిరుపతికి వెళ్లాలని బలవంతం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీ ఆపించడానికి ఇద్దరు హోంగార్డుల నుంచి పెద్ద మొత్తంలోనే డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి.

పోలీసు కార్యాలయంలో పనిచేసే ఓ గుమస్తా, హోంగార్డు విభాగంలో పనిచేసే ఓ వ్యక్తి కలిసి ఈ మతలబుకు పాల్పడినట్లు సాటి హోంగార్డులు ఆరోపిస్తున్నారు. దీనిపై చిత్తూరు హోంగార్డుల ఆర్‌ఐ చంద్రశేఖర్‌ను సంప్రదించగా పేర్లు మార్చే సారనే ఆరోపణలను విచారించి.. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడి ఉంటే ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పండుగకు ముందే జీతాలు చెల్లించండి



రెడ్డి శేఖర్‌రెడ్డి, వైఎస్‌ఆర్ టీఎఫ్ రాష్ట్ర ట్రెజరర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న టీచర్లకు పండుగకు ముందే జీతాలు చెల్లించాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి నెల చివర్లో హిందూ, ముస్లింల ముఖ్యమైన పండుగలు ఉన్నట్లు తెలిపారు. ఈ పండుగలకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈనెల 29వ తేదీనే ముందస్తుగా ప్రభుత్వం జీతాలు చెల్లించాలన్నారు. 30వ తేదీన ఉగాది, 31వ తేదీన రంజాన్ ఉండడంతో ఆలస్యంగా జీతాలు చెల్లిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఉద్యోగులు, టీచర్లు తమ కుటుంబ సభ్యులతో పండుగలు సంతోషంగా జరుపుకోవాలంటే కూటమి ప్రభుత్వం వేతనాలు ముందస్తుగా చెల్లించాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై పోరు

- నూతన ఫ్యాప్టో ఛైర్మన్‌గా మణిగండన్ ఎన్నిక



మణిగండన్, జిల్లా ఛైర్మన్

చిత్తూరు కలెక్టరేట్ : విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని ఫ్యాప్టో (ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) నాయకులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఫ్యాప్టో సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికైన నూతన కార్యవర్గ నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం టీచర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియకు ఎన్నికల అధికారిగా స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరోత్తమరెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా గంటామోహన్, జీవీ రమణ, చంగల్రాయమందడి వ్యవహరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. విద్యారంగ సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు.

ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ ఎన్నికపై అభినందనలు

ఫ్యాప్టో సంఘం నూతన ఛైర్మన్‌గా మణిగండన్ (యూటీఎఫ్), సెక్రటరీ జనరల్‌గా మునీర్ అహ్మద్ (రూటా), కో ఛైర్మన్‌గా రామమూర్తి (బీటీఏ), అరుణ్‌కుమార్ (హెచ్‌ఎంల సంఘం), రహమత్ బాషా(ఎస్‌ఏఏ), డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా మదన్‌మోహన్‌రెడ్డి (ఎస్టీయూ), చిట్టిబాబు (ఏపీటీఎఫ్1938), ముక్తార్ అహ్మద్ (ఏపీటీఎఫ్ 257), మనాఫ్ (ఆప్తా) తదితర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలిపారు.

భక్తుల సంబరం.. జాతర వైభవం

- గంగ జాతరకు పోటెత్తిన భక్తులు
- గెరిగెలతో మొక్కులు చెల్లించిన వైనం
- గ్రామాల్లో జాతర సందడి
- పటిష్టంగా పోలీసు బందోబస్తు





పుంగనూరులో జాతరకు హాజరైన భక్తజనం, (ఇన్‌సెట్) అలంకరణలో సుగుటూరు గంగమ్మ

పుంగనూరు : జమీందారుల కులదైవమైన శ్రీసుగుటూరు గంగమ్మ జాతరలో బుధవారం అమ్మవారిని భక్తుల సందర్శనార్థం ప్యాలెస్‌లోని ఆలయంలో ఉంచారు. అమ్మవారికి తొలి పూజలు జమీందారులు నిర్వహించగా బెస్తవారు, యాదవులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి భక్తుల దర్శనానికి అనుమతించారు. జాతరకు ఆంధ్రా , కర్ణాటక, తమిళనాడుకు చెందిన ప్రజలు వేల మంది హాజరై పూజలు చేశారు. ప్రజలు ఆడవారి వేషధారణలో అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మట్టి కుండలకు గెరిగెలు తయారు చేసి ఆలయంలో ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

జాతర హోరు...

పట్టణంలోని విరూపాక్షి మారెమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి వేల సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. అలాగే బజారువీధిలో నడివీధి గంగమ్మ, తూర్పు మొగసాలలో గంగమ్మ, బాలాజీ థియేటర్ వద్ద మలారమ్మ గంగమ్మ, మైసూర్ బ్యాంకు వద్ద నల్లగంగమ్మ, బస్టాండులో విరూపాక్షి మారెమ్మ, నల్లరాళ్లపల్లె వద్ద నల్ల గంగమ్మ, కోనేరు వద్ద బోయకొండ గంగమ్మ, నానాసాహెబ్‌పేటలోని నడివీధి గంగమ్మలను ఉంచి పట్టణ ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కిక్కిరిసిన జనం

మండు టెండలో వేల మంది భక్తులు శ్రీ సుగుటూరు గంగమ్మ జాతరలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సహాయ కార్యక్రమాలు చేపట్టారు. డీఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో సీఐలు భాస్కర్, రామ్‌భూపాల్, ఉమామహేశ్వర్, అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 250 మంది పోలీసులు పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు. జాతర సందర్భంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పోలీసులు ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నిమజ్జనం

రెండు రోజుల పాటు జరిగిన శ్రీ సుగుటూరు గంగమ్మ జాతర బుధవారం అర్ధరాత్రి ముగిసింది. అమ్మవారికి జమీందారులు మలిపూజలు నిర్వహించారు. రాత్రి పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి, గురువారం వేకువజామున నిమజ్జనం చేసి, అమ్మవారి విగ్రహాన్ని జమీందారులకు అప్పగించారు.





అమ్మవారికి గెరిగెలు తీసుకొచ్చి మొక్కులు చెల్లించుకుంటున్న జనం, జాతరలో అమ్మవారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

క్లుప్తంగా

మద్యం దుకాణాన్ని అడుకున్న జనం



నూతన మద్యం షాపును అడ్డుకుంటున్న స్థానికులు

పుత్తూరు : స్థానిక నగరం రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేస్తున్న నూతన మద్యం దుకాణానికి బుధవారం స్థానికులు అడ్డుకున్నారు. కల్లుగీత కార్మికుల కోటా కింది షాపును దక్కించుకొన్న వారు ఆలయ సమీపంలో ఓ గదిని అద్దెకు తీసుకొని మద్యం దించుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. దీనిపై స్పందించిన ఎక్సైజ్ ఎస్ఐ శివప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలకు 100 మీటర్లకు అవతల మద్యం షాపు ఏర్పాటు చేసుకోవచ్చునని తెలిపారు. అలాగే దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయానికి, 30 పడకల ఆసుపత్రికి సైతం 100 మీటర్ల దూరాన్ని పాటించాలని స్పష్టం చేశారు. అయితే ఇక్కడ నిబంధనలను అతిక్రమించి షాపు ఏర్పాటు చేయడం లేదని వెల్లడించారు. అయినా స్థానికులు అంగీకరించకపోవడంతో షాపును మరో చోటుకి తరలించడానికి నిర్వాహకులు అంగీకరించి, సదరు షాపులోని సరుకును అక్కడి నుంచి తరలించడంతో వివాదం సద్దుమణిగింది.

సీకే బాబు ఇంట్లో చోరీ.. 3 నెలల జైలు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ఇంట్లో జరిగిన చోరీ కేసులో మహేష్ (30) అనే నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ చిత్తూరులోని స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ వెన్నెల బుధవారం తీర్పునిచ్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతి కథనం మేరకు.. కట్టమంచిలోని సీకే బాబు ఇంట్లో 2023 గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి రూ.లక్ష నగదు చోరీ చేసి పారిపోయాడు. సీకే లావణ్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన చిత్తూరు పోలీసులు.. కట్టమంచికి చెందిన మహేష్‌ను అరెస్టు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ ఎంబీసీ వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,252 మంది స్వామివారిని దర్శించుకోగా 25,943 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.68 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించబోరని స్పష్టం చేసింది.

‘మార్గ’దర్శనం కుదిరింది!

తిరుపతి–కాణిపాకం హైర్ సర్వీసులు తిరగాల్సిన మార్గ వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. గత మంగళవారం మార్గ వివాదంతో అద్దెబస్సులు ఆగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు హైర్ బస్సుల యాజమాన్యాలు చర్చలు జరిపాయి. ఒక ఒప్పందానికి వచ్చి సర్దుబాటు చేసుకున్నాయి. దీంతో మార్గదర్శనం కుదిరినట్లు అయ్యింది.

- వెళ్లేటప్పుడు వారధి కిందే..
- వచ్చేటప్పుడు వారధిపైన
- తిరుపతి–కాణిపాకం హైర్ బస్సులపై క్లారిటీ
- రూట్ వివాదాలకు తెరపడినట్లేనా?
- చర్చలు సఫలం



తిరుపతి–కాణిపాకం హైర్ బస్సులు

తిరుపతి అర్బన్: తిరుపతి–కాణిపాకం మార్గంలో నడుస్తున్న హైర్ బస్సుల(ఆర్టీసీ అద్దె బస్సులు) వివాదాలకు తెరపడిందని అంతా భావిస్తున్నారు. కొద్ది రోజులుగా హైర్ బస్సులపై రూట్ వివాదాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం(ఈ నెల 25న) అరకొర బస్సులు మినహా మిగిలిన హైర్ బస్సులను కాణిపాకం గ్రామానికి నడపకుండా తిరుపతి సెంట్రల్ బస్టాండ్కే పరిమితం చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండు రోజులుగా ఆర్టీసీ అధికారులకు అద్దె బస్సుల యాజమాన్యంతో జరిపిన చర్చలు ఓ కొలిక్కి వచ్చాయి. తిరుపతి నుంచి కాణిపాకం గ్రామానికి వెళ్లే సమయంలో బస్టాండ్ నుంచి గరుడవారధి కింద మార్గంలో లీలామహల్, కపిలతీర్థం, అలిపిరి మీదుగా కాణిపాకం గ్రామానికి వెళ్లాల్సి ఉంది. కాణిపాకం నుంచి తిరుపతికి వచ్చే సమయంలో కపిలతీర్థం నుంచి గరుడ వారధిపైన బస్టాండ్‌కు వచ్చేలా నిర్ణయించారు.

ట్రిప్పులు యథావిధిగా తిరగాల్సిందే

తిరుపతి నుంచి కాణిపాకం గ్రామానికి 14 సర్వీసులు నడుస్తున్నాయి. అందులో 8 సర్వీసులు అద్దె బస్సులు, 6 సర్వీసులు ఆర్టీసీ బస్సులున్నాయి. అద్దె బస్సులో ఒక్కో సర్వీసు రోజూ తిరుపతి– కాణిపాకం మధ్యలో మూడు ట్రిప్పులు తిరగాల్సిందే. మొత్తంగా 8 అద్దెబస్సులు రోజుకు(3 ట్రిప్పులు చొప్పున) 24 ట్రిప్పులు నడపడానికి నిర్ణయించారు.

ప్రయాణికులకే తొలి ప్రాధాన్యం



ఆర్టీసీ ప్రయాణికులకే తొలి ప్రాధాన్యత కల్పిస్తుంది. అద్దె బస్సులు నాలుగేళ్ల అగ్రిమెంట్ ప్రకారం తిరుపతి బస్టాండ్ నుంచి కాణిపాకం గ్రామానికి వెళ్లే సమయంలోనూ వచ్చే సమయంలోనూ గరుడవారధి కింది మార్గంలోనే వెళ్లాల్సి ఉంది. ఒక్కో సర్వీస్ రోజుకు 3 ట్రిప్పులు తిప్పాలని నిర్ణయించాం. అయితే డ్రైవర్లు కొన్ని ఇబ్బందులు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో తిరుపతి నుంచి కాణిపాకం వెళ్లే సమయంలో గరుడవారధి కింది మార్గంలోను, వచ్చే సమయంలో మాత్రమే వారధిపై మార్గంలో నడపడానికి అంగీకరించాం. దీంతో హైర్ బస్సుల సమస్య పరిష్కారించాం. భక్తుల సౌకర్యం కోసమే వెళ్లే సమయంలో వారధి కింది భాగంలో వెళ్లాలని స్పష్టం చేశాం.

– బాలాజీ, డిపో మేనేజర్, తిరుపతి బస్టాండ్

ఓజీ కుప్పం దొంగల ముఠా అరెస్టు

- తుమకూరు జిల్లాలో పలు చోరీలు
- రూ.16 లక్షల సొత్తు సీజ్



స్వాధీనం చేసుకున్న సొత్తుతో పోలీసులు

తుమకూరు(కర్ణాటక): కార్ల అద్దాలను పగలగొట్టి లోపల దొరికిన నగదు, నగలు, విలువైన వస్తువులను తస్కరించే ఓజీ కుప్పం దొంగల ముఠాను కర్ణాటకలో తుమకూరు జిల్లా గుబ్బి స్టేషన్ పోలీసులు పట్టుకున్నారు. రూ.16 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోని చిత్తూరు జిల్లా ఓజీ కుప్పానికి చెందిన జి.శివ, సుబ్రమణ్యం నిందితులు అరెస్టు కాగా, అంకయ్య, కిరణ్, రాజశేఖరయ్య పరారీలో ఉన్నారు.

క్షణాల్లో రూ.15 లక్షల మాయం

గుబ్బికి చెందిన శివరాజు గతనెల 27న ఓ బ్యాంకు నుంచి రూ.15 లక్షలు డ్రా చేసుకుని కారులో పెట్టుకుని, ఏపీఎంసీ ముందు భాగంలో కారు నిలిపి లోపలకు వెళ్లి పని ముగించుకుని వచ్చాడు. అంతలోనే కారులోని డబ్బు మాయమయ్యాయి. బాధితుడు గుబ్బి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాల చిత్రాలు, ఇతర ఆధారాలను సేకరించి నిందితులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి కొంత నగదు, ఒక బంగారు బ్రాస్లెట్‌తో సహా రూ.16 లక్షల విలువ చేసే ఆభరణాలను జప్తు చేశారు.

వచ్చే ఏడాది నుంచి ‘సూపర్ సిక్స్’

- ‘రచ్చబండ’లో సీఎం సతీమణి భువనేశ్వరి



రచ్చబండ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

గుడుపల్లె : సూపర్ సిక్స్ పథకాలు వచ్చే ఏడాది నుంచి అందరికీ అందుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేద కుటుంబాల్లోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు త్వరలో అందజేస్తామన్నారు. గుడుపల్లె మండలంలోని గుడిచెంబగిరిలో బుధవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. నాలుగు రోజుల కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మొదటి రోజు బుధవారం గుడుపల్లె మండలంలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆడిటోరియంలో విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం గుడిచెంబగిరి గ్రామంలో పర్యటించి మహిళలతో ప్రసంగించారు. హంద్రీ–నీవా కాలు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. త్వరలో కాలువలో నీరు వచ్చి తాగు, సాగు నీరు కొరత లేకుండా చేస్తామన్నారు. పథకాల పట్ల అసంతృప్తి పడకుండా నమ్మకం పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్, డాక్టర్ సురేష్‌బాబు, టీడీపీ బోర్డు డైరెక్టర్ శాంతారాం, పార్టీ మండల అధ్యక్షుడు బాబు నాయుడు. మాజీ ఏఎంసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అన్నమయ్య వర్ధంతి మహోత్సవాలు ప్రారంభం

తిరుపతి కల్చరల్: టీటీడీ, హిందూ ధార్మిక ప్రాజెక్టుల అన్నమాచార్య కళామందిరంలో అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవాలు బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం అలరింపజేసింది. ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, స్థానిక కళాకారులు కలిసి దినం, ద్వాదశి, సప్తగిరి సంకీర్తనలను రాగయుక్తంగా ఆలపించారు. అనంతరం హారతి మహానివేదన చేపట్టారు. తిరుపతికి చెందిన జయంతి ,సావిత్రి బృందం ఆలపించిన ‘అన్నమయ్య జీవిత చరిత్ర’ హరికథాగానం సభికులను ఆకట్టుకుంది. సాయంత్రం అనూష, ఆర్తి బృందం ప్రదర్శించిన సంగీత కచేరి, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకుడు వెంకటేశ్వర్లు భాగవతార్ బృందం హరికథా గానం రసరమ్యంగా సాగింది. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు రాజగోపాలరావు పాల్గొన్నారు.

ప్రజావేదికలో అధికారులకు చోటేదీ?

- సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు
- వేదికపై కూటమి నేతల బెదిరింపులు



వేదిక మొత్తం కూటమి నాయకులు ఇలా..

శ్రీరంగరాజపురం : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకుందామని వస్తే అక్కడికి వచ్చిన ప్రజలకు కూటమి నేతల ఓవరాక్షన్, బెదిరింపులతో సమస్యలు చెప్పనీయకుండా అడ్డుకున్నారు. మండలం కేంద్రంలో బుధవారం వెలుగు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్దామని వచ్చిన ప్రజలకు కొంత మంది కూటమి నేతలు అడ్డుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన వేదికలో కూటమి నాయకులే ఉన్నారు తప్ప అధికారులకు వేదికపై చోటు కల్పించకపోవడంతో అక్కడికి వచ్చిన ప్రజలు ఆశ్చర్యపోయారు. ఎమ్మెల్యే, అధికారులకు సమస్యలను తెలియజేస్తామని వస్తే వేదిక మొత్తం నాయకులే ఉన్నారు తప్ప అధికారులు లేకపోవడంతో ప్రజలు కొంత మంది వెనుదిరిగారు. ఎగువకమ్మకండ్రిగ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ భార్య సుబ్బలక్ష్మి నా భర్తను ఉద్యోగం నుంచి తీసేస్తున్నామని కూటమి నాయకులు బెదిరిస్తున్నారు అని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని చెప్పడంతో అక్కడే ఉన్న మండల అధ్యక్షుడు జయశంకర్ నాయుడు, బాలాజీ నాయుడు జోక్యం చేసుకొని నీ భర్త ఉద్యోగం తీసేస్తే ..నీవెందుకు వచ్చావ్ అంటూ ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతి పత్రంపై ఎమ్మెల్యే రాసిన వాటిని సైతం కొట్టివేశారు. ఎమ్మెల్యేకు సమస్యలను తెలియజేయడానికి వస్తే మీ ఓవరాక్షన్ ఏంటి అని అక్కడి వచ్చిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటప్పుడు ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. వేదిక మొత్తం కూటమి నాయకులే ఉన్నారే తప్ప అధికారులు లేకపోవడం గమనార్హం.

వైఎస్సార్ సీపీ అనుబంధ రాష్ట్ర విభాగ కమిటీలు

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లాకు చెందిన రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల ఎంపిక చేశారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా వయ్యాల కృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎం.పిచ్చిరెడ్డి, ఎం.నరసింహారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సి.మునికృష్ణ, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కల్లూరి చెంగయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యర్శులుగా సి.కాలప్ప, నల్లాని బాబు, కార్యదర్శులుగా గురునాథం ఉగ్గుమూడి, సుగుణప్ప, పి.శ్యామల్, సంయుక్త కార్యదర్శిగా శ్యామ్‌సుందర్‌రాజ్ నియమితులయ్యారు. అలాగే వీవర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బి.తిలక్ బాబు, వీవర్స్ వింగ్ కార్యదర్శిగా పులి రామచంద్రయ్య, వలంటీర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చేగు ప్రశాంత్ గుప్త, కార్యదర్శులుగా ఉదయగిరి రమేష్, ఎం.వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.హరినాథరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు.

ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విజయసింహారెడ్డి

చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మాదిరెడ్డి విజయసింహారెడ్డిని ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

జాతీయ సబ్ జూనియర్స్ పోటీలకు ఎంపిక



అఖిల్‌ను అభినందిస్తున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకు చెందిన అఖిల్ జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ అన్నారు. ఈ మేరకు ఆ విద్యార్థిని బుధవారం క్రీడాభివృద్ధి కార్యాలయంలో అభినందించారు. జిల్లాలో ఖేలో ఇండియా ఫెన్సింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న అఖిల్ ఈనెల 1వ తేదీన విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఆ పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. అలాగే 30వ తేదీ వరకు ఒడిశాలోని కటక్ లో నిర్వహించే జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రాఘవ్ కార్తీక్ పాల్గొన్నారు.

గజరాజుల ఆగ్రహం

- అప్రమత్తతతో తప్పిన ప్రమాదం
- ముప్పతిప్పలు పెడుతున్న ఏనుగులు
- భయాందోళనలో మండల ప్రజలు

యాదమరి : ఏనుగులు దాడికి యత్నించడంతో రైతులు అప్రమత్తంగా వ్యవహరించి తప్పించుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని దళవాయిపల్లి గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. మంగళవారం రాత్రి సమయంలో దాదాపు 14 ఏనుగులు గుంపుగా పంట పొలాల్లోకి ప్రవేశించాయన్నారు. గ్రామస్తులు వాటిని మళ్లించేందుకు ప్రయత్నించారు. అయితే తిరగబడిన ఏనుగులు వీరిపై దాడికి ప్రయత్నించాయి. రైతులు వెంటనే అప్రమత్తమై తప్పించుకున్నారు. ఆ తరువాత రైతులు కృష్ణయ్య, గోవిందస్వామి, జయమ్మకు చెందిన వరి, మామిడి, అరటి పంటలను ధ్వంసం చేశాయి. పగలంతా నుంజర్ల ప్రాజెక్టు వద్ద సేద తీరి..రాత్రి అయితే ఇలా సమీప పంట పొలాలపై విరుచుకు పడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు నష్టపోయిన తమ పంటలకు నష్ట పరిహారం చెల్లించలేదని అధికారులపై మండి పడుతున్నారు. అటవీ బీట్ అధికారి ప్రతాప్, సిబ్బందితో బాధిత రైతుల పంట పొలాలను పరిశీలించి పంట నష్ట అంచనా రూపొందించారు. కాగా కొద్ది నెలలుగా దాదాపు 24 ఏనుగులు వరకు మండల అటవీ ప్రాంతంలో తిష్టవేసినట్లు రైతులు చెబుతున్నారు. దీంతో ఏ సమయానికి ఎటువైపు నుంచి వచ్చి దాడి చేస్తాయో తెలియక సమీప గ్రామ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇటు రైతులను..అటూ అటవీ శాఖ అధికారులను గజరాజులు ముప్పతిప్పలు పెడుతున్నాయి. ఏనుగులు పంట పొలాల్లోకి రాకుండా అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని..లేకపోతే భవిష్యత్తులో సమీప గ్రామాల్లోని ప్రజలు పంటలు వేసుకోలేని పరిస్థితులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల్లో బెట్టింగుల జోరు

- సెల్‌ఫోన్ల ద్వారానే సాగుతున్న దందా
- ఆఫ్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా మోసాలు
- ఐపీఎల్ రాకతో ఊపందుకున్న వైనం

పలమనేరు : నగరాలు, పట్టణాలకే పరిమితమైన క్రికెట్ బెట్టింగులు ఇప్పుడు పల్లెల్లోనూ హోరెత్తుతున్నాయి. ఐపీఎల్ సీజన్ ముగిసేలోపు లక్షాధికారులవుతారనే బెట్టింగ్ ముఠా లేనిపోని ఆశలు రేకెత్తించింది. కష్ట పడకుండా సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఉద్యోగులు, రైతులు, యువకులు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు ఐపీఎల్ బెట్టింగుల ఊబిలోకి దిగుతున్నారు. తీరా నష్టపోయి అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం ఐపీఎల్–25 సీజన్ మొదలు కావడంతో చిత్తూరు జిల్లాలోని చిన్నపాటి గ్రామాల్లోనూ క్రికెట్ బెట్టింగులు జోరందుకున్నాయి. రూ.వంద నుంచి లక్షల్లో బెట్టింగులు సాగుతున్నట్లు తెలుస్తోంది. బాధితుల నుంచి ఫిర్యాదులు అందితే తప్ప బెట్టింగు రాయుళ్లను గుర్తించడం పోలీసులకు వీలు కావడంలేదు.

ఆఫ్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు

ప్రస్తుతం సాగుతున్న బెట్టింగులు మూడు రకాలుగా ఉన్నాయి. కొంత మంది కలసి ఆన్‌లైన్ పేమెంట్ల ద్వారా బెట్టింగులు చేస్తున్నారు. ఇంకొందరు రహస్య ప్రదేశాల్లో ఉంటూ మ్యాచ్‌లు మొదలైనప్పటి నుంచి గ్రూపుల్లోని వ్యక్తులతో చాటింగ్ చేస్తూ బెట్టింగులు చేస్తున్నారు. ఎక్కువ మంది మాత్రం ఎవరికీ తెలియకుండా ఉండేందుకు ఆఫ్‌లైన్ యాప్‌లను వాడుతున్నారు. డార్క్‌నెట్ సాయంతో ఇవి పని చేస్తాయని తెలుస్తోంది. తాజాగా పోలీసులు కేసు నమోదు చేసిన రాయలపేటకు చెందిన నిందితుడు చంద్రబాబు సైతం ఆఫ్‌లైన్ ద్వారా కోట్ల రూపాయల మోసాలకు పాల్పడిన విషయం సంచలమైంది.

ఇటీవల కాలంలో జరిగిన ఘటనలు ఇలా..

- పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు క్రికెట్ బెట్టింగుల కారణంగా అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్నాడు.
- పలమనేరు పట్టణానికి చెందిన ఓ యువకుడు బెట్టింగుల కారణంగా తన వ్యాపారాన్ని వదులుకొని బెంగళూరుకు వలస వెళ్లాడు.
- పెద్ద పంజాణి మండలంలో ఓ యువకుడు బెట్టింగ్‌ల కారణంగా సమీపంలోని అడవిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- మదనపల్లికి చెందిన ఓ బీటెక్ విద్యార్థి పలమనేరులోని పాతపేటలో రూమ్‌లో ఉంటూ ఆన్‌లైన్ బెట్టింగుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు.
- ఇలాంటి సంఘటనలు జిల్లాలో మూడేళ్లల్లో పెద్ద సంఖ్యలో జరిగాయి. కానీ వెలుగు చూడలేదు.

బెట్టింగుల కారణంగా యువత జీవితాలు నాశనమై ఆ కుటుంబాలలోని పెద్దలకు మనోవేధనను మిగిల్చారు. చాలా మంది యువకులు తమ బైక్‌లు, ఒంటిపై ఉన్న చైన్లు, ఉంగరాలను తాకట్టు పెట్టిన ఘటనలు ఉన్నాయి. అదీ చాలక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చాలా మంది బెట్టింగులను ఓ వ్యసనంలా మార్చుకున్నారు.

ప్రత్యేక నిఘా ఉంచాం

సబ్ డివిజన్ పరిధిలో క్రికెట్ బెట్టింగులపై ఇప్పటికే నిఘా ఉంచాం. అయితే బెట్టింగుల్లో బాధితులుగా మారిన వారి ద్వారా కీలక సమాచారాన్ని తెలుసుకొని బెట్టింగు ముఠాలను పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎవరైనా బెట్టింగులకు పాల్పడుతుంటే 112 లేదా 100 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

– ప్రభాకర్, డీఎస్పీ, పలమనేరు

నచ్చిన రోజే.. రిజిస్ట్రేషన్

ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు మంచి ముహూర్తం లో చేసుకోవాలని అనుకుంటున్నారా? అయితే ఆ శాఖ మీకు ఓ శుభవార్త తీసుకొచ్చింది..మీకు నచ్చిన రోజు.. నచ్చిన సమయం ఎంపిక చేసుకొని వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే చాలు.. కార్యాలయం వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉండదు..మీరు ఎంచుకొన్న రోజు నింపాదిగా రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే చాలు.. పని పూర్తి చేసుకొని గంటల్లోనే ఇంటికి చేరుకోవచ్చు.. ఈ కొత్త స్లాట్ బుకింగ్ విధానాన్ని ఏప్రిల్ 1 నుంచి జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు.

- అందుబాటులోకి స్లాట్ బుకింగ్ సేవలు
- ఏప్రిల్ 1 నుంచి ప్రయోగాత్మకంగా అమలు
- నిర్దేశించిన సమయానికి వచ్చే వెసులుబాటు
- ఆస్తుల రిజిస్ట్రేషన్స్‌కు తప్పనున్న ఇబ్బందులు





రిజిస్ట్రేషన్‌శాఖ వెబ్‌సైట్‌లో కొత్తగా పెట్టిన స్లాట్ బుకింగ్ ఆప్షన్, జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్ : ఆస్తి లావాదేవీల రిజిస్ట్రేషన్స్‌కు ఇక స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనున్నారు. నిర్దేశించిన సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకొనే విధంగా వెసులుబాటు ఇచ్చారు. ఈ విధానం విజయవాడలోని కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశ పెట్టారు. అక్కడ విజయవంతం కావడంతో అన్ని జిల్లాలో వీటిని దశల వారీగా అమలు చేయనున్నారు. ఏప్రిల్ 1 నుంచి జిల్లా అర్బన్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో (ఆర్ఓ)లో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేసే అవకాశం ఉంది.

మంచి ముహూర్తాలు, మంచి రోజులు చూసుకుని ఎక్కువ మంది ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయించుకుంటారు. ఒకే సమయంలో కొనుగోలు, విక్రయదారులు రావడంతో ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోంది. ఇతర రోజుల్లో అంత మొత్తంలో లావాదేవీలు జరగవు. పని మీద కార్యాలయానికి వెళ్తే దాదాపు ఒకరోజు అంతా అక్కడే గడపాల్సి వస్తోంది. దీంతో స్లాట్ బుకింగ్ విధానంపై జిల్లాలోని సీనియర్ సహాయకులకు షెడ్యూల్ వారీగా తాడేపల్లిలోని ఐజీ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ప్రయోగాత్మకంగా మొదట జిల్లా కేంద్రంలో వీటిని అమలు చేసి తర్వాత అన్ని కార్యాలయాల్లో ప్రవేశ పెట్టాలని చూస్తున్నారు.

గంటకు ఆరుగురికి

జిల్లా పరిధిలో మొత్తం 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో రోజు 200–250 వరకు దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. వీటిలో ఎక్కువ చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, కుప్పం నందు జరుగుతున్నాయి. తొలుత జిల్లా కేంద్రం (ఆర్ఓ)లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. వినియోగదారులు వారు కోరుకున్న రోజు, సమయం సంబంధిత వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చు. నిర్దేశించిన సమయానికి కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. గంటకు ఆరుగురు చొప్పున స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఒక వేళ ఆ రోజు, ఆ సమయానికి రాని పక్షంలో మరుసటి రోజు రావాల్సి ఉంటుంది.

వేచిచూసే పని ఉండదు

స్లాట్ బుకింగ్ విధానంతో క్రయ, విక్రయదారులు కార్యాలయం నందు వేచిచూసే పని తప్పుతుంది. వారికి కావాల్సిన సమయానికి రిజిస్ట్రేషన్‌కు హాజరు కావచ్చు. దీనికి సంబంధించి పూర్తి విధి విధానాలు రావాల్సి ఉంది.

– ఏవీఆర్ మూర్తి, జిల్లా రిజిస్ట్రార్

అదుపు తప్పి కారు బోల్తా

– ముగ్గురు విద్యార్థులకు తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన కారు

పుత్తూరు : చెన్నై నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొనడంతో మూడు పల్టీలు కొట్టి రోడ్డుకు అవతల వైపు పడిన సంఘటన బుధవారం స్థానిక బైపాస్ రోడ్డులో చోటు చేసుకొంది. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు... చెన్నైకి చెందిన ముగ్గురు విద్యార్థులు కారులో బయలుదేరి పుత్తూరు సమీపంలోని కోనకు వస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రసన్న అనే విద్యార్థి కారును వేగంగా నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రసన్నతో పాటు కారులో ప్రయాణిస్తున్న పరమేష్, నితీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తిరువళ్లూరు జీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.